సాక్షి
నల్లగొండ
సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



దసరా స్కీంల జోరు

దసరా పండుగ సమీపిస్తున్న తరుణంలో పలు గ్రామాల్లో మద్యం, మాంసం స్కీంల జోరు నడుస్తోంది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 588.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 43.804 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 43.804 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29.313 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 6.253 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5.438 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2.400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.68 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 2.402 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 2013.88 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 313.56 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 217.08 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు

నల్లగొండ : నల్లగొండ – ఖమ్మం – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం నేడు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. సోమవారం ప్రారంభం కానున్న ఓటరు నమోదు ప్రక్రియ నవంబర్ 6వ తేదీ వరకు కొనసాగనుంది. నవంబర్ 23వ తేదీన ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. దానిపై అభ్యంతరాలు స్వీకరించి ఆ తర్వాత డిసెంబర్ 30వ తేదీన తుది జాబితాను ప్రకటించనున్నారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి గతంలో ఓటు హక్కు ఉన్నవారితోపాటు కొత్తవారు కూడా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

మార్క్సిజమే ప్రపంచ మానవాళికి మార్గదర్శకం



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: మార్క్సిజమే ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం దామరచర్ల మండలంలోని గాంధీనగర్ సీపీఎం గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రపంచమంతా కమ్యూనిస్టు మార్గదర్శకంగా కదులుతుందన్నారు. కొన్ని దేశాల్లో ఆర్థిక సంక్షోభం ఏర్పడి ప్రజలు తిరగబడుతుంటే ఆ దేశ అధ్యక్షులు పారిపోయే పరిస్థితి నెలకొందన్నారు. భారత దేశానికి మార్క్సిజమే మార్గదర్శకం అవుతుందన్నారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా బి.ప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఈదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మాశోతు వినోద్‌నాయక్, నాయకులు పాపానాయక్, కోటిరెడ్డి, దయానంద్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు చేయడంలో యూటీఎఫ్ మేటి



మహాసభలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేయడంలో యూటీఎఫ్ మేటిగా నిలుస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. విద్యారంగాన్ని కాపాడే విషయంలో యూటీఎఫ్ నాయకత్వానికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి సీహెచ్ వీరారెడ్డి పాల్గొన్నారు.

పంచనారసింహుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవ, ఆరాధన, అనంతరం నిజాభిషేకం, అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ద్వారబంధనం చేశారు.

3 నుంచి యాదాద్రిలో శరన్నవరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 3నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ భాస్కర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు కొనసాగుతాయన్నారు. భక్తులు నవరాత్రి పూజల్లో పాల్గొనేందుకు రూ.1,116, సప్తశతి పారాయణం చేసేందుకు రూ.116, లక్ష కుంకుమార్చనకు రూ.116 టికెట్ తీసుకోవాలని పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శివాలయంలో నిర్వహించే రుద్రహోమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

● నవరాత్రులకు దుర్గామాత ప్రతిమలు సిద్ధం





గురువారం నుంచి ప్రారంభంకానున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నల్లగొండలోని నెహ్రూగంజ్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు, కొనుగోలు చేసేందుకు వచ్చిన భక్తులు
- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

పప్పు పంటలపై అనాసక్తి!

- జిల్లాలో ఏటేటా తగ్గుతున్న పప్పుధాన్యాల సాగు
- పత్తి, వరి, మిర్చి పంటలపైనే రైతుల ఆసక్తి
- పప్పు పంటల సాగుపై అవగాహన కల్పించని అధికారులు
- సబ్సిడీపై అందని విత్తనాలు, ఎరువులు



నల్లగొండ అగ్రికల్చర్ : పప్పు ధాన్యాలైన కంది, మినుము, బొబ్బర, పెసర, పంటల సాగు జిల్లాలో ఏటేటా తగ్గుతోంది. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో కూడా సాగు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ రైతులు పప్పు ధాన్యాల పంటల సాగుకు ఆసక్తి చూపడంల లేదు. కేవలం దేవరకొండ డివిజన్‌లోని మండలాల్లో మాత్రమే పప్పు ధాన్యాల పంటలు సాగవుతున్నాయి. వాణిజ్య పంటలైన పత్తి, మిరప, ఆహార పంటలైన వరి మాత్రమే జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. కేవలం వందల ఎకరాల్లో మాత్రమే పప్పు ధాన్యాల పంటలను సాగు చేస్తున్నారు. సాగు తగ్గడం వల్ల కంది, పెసర, మినుము తదితర పప్పుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

గతంలో భారీగా సాగు

జిల్లాలో గతంలో రైతులు కంది, పెసర, మినుము, బొబ్బర్లు వంటి పప్పు ధాన్యాల పంటలను పెద్ద ఎత్తున సాగు చేసేవారు. కందులను లక్షల క్వింటాళ్ల పండించిన ఘన చరిత్ర జిల్లా రైతులకు ఉంది. అయితే పంట చేతికొచ్చిన తర్వాత వాటిని అమ్మడానికి అప్పటల్లో మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు ఇబ్బంది పడాల్సి వచ్చేది. అప్పటి ప్రభుత్వాలు కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ సరైన మద్దతు ధర లేకపోవడం, డబ్బులు సకాలంలో ఇవ్వకపోయేవారు. పెసర్లు పండించినా అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. పండించడం ఒక ఎత్తయితే వాటిని అమ్ముకోవడం మరో ఎత్తవుతుందని దీంతో పప్పు ధాన్యాల పంటలను తగ్గించి ఇతర ప ంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి

పప్పు ధాన్యాల పంటల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడంతోపాటు వాటిని అమ్మడానికి సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను అందించడంతో పాటుగా పంటల సాగుపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే పప్పు ధాన్యాల పంటల సాగు పెరిగే అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

వర్షాధారంగా సాగు చేసుకోవచ్చు



జిల్లాలో కంది, పెసర, మినుము, బొబ్బర్లు వంటి పప్పు ధాన్యాల పంటలు సాగు చేసే విధంగా రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహిస్తాం. సాగు తగ్గడం వల్ల పప్పు ధాన్యాల ధరలు పెరిగే ప్రమాదం ఉంటుంది. మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంగా ఈ పంటలు సాగు చేయవచ్చు.
- పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ నల్లగొండ

2020 నుంచి జిల్లాలో పప్పు ధాన్యాల సాగు ఇలా....(ఎకరాల్లో)

సంవత్సరం	సీజన్	కంది	మినుము	పెసర
2020	వానాకాలం	21,154	76	1,044
	యాసంగి	--	230	757
2021	వానాకాలం	10,807	8	329
	యాసంగి	28	1,214	2,213
2022	వానాకాలం	3,273	38	88
	యాసంగి	5	55	1,252
2023	వానాకాలం	942	76	548
	యాసంగి	176	203	649
2024	వానాకాలం	2,479	526	1,130

డిగ్రీతో జ్యాబ్ గ్యారెంటీ

- ఎన్జీ కళాశాలలో నూతనంగా బీఎఫ్‌ఎస్ఐ కోర్సు
- రెగ్యులర్ డిగ్రీతో పాటు నైపుణ్య శిక్షణ
- కోర్సు అనంతరం నేరుగా కంపెనీల్లో ఉద్యోగ అవకాశం



రామగిరి(నల్లగొండ) : డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకు అనుగుణంగా విద్యా ప్రణాళికను రూపొందించింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో 38 బీటెక్, డిగ్రీ కళాశాలల్లో బ్యాంకింగ్, ఫైనాన్స్, సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) కోర్సును ప్రవేశపెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 20 డిగ్రీ కాలేజీల్లో ఈ కోర్సును అందుబాటులోకి వచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎన్జీ కళాశాలలో బీఎఫ్ఎస్ఐ కోర్సు ప్రవేశపెట్టింది. రెగ్యులర్ డిగ్రీ కోర్సుతో పాటు అదనంగా బీఎఫ్ఎస్ఐ కోర్సును అభ్యసిస్తారు. దీని వల్ల కోర్సు పూర్తయిన వెంటనే యువత ఉద్యోగ అవకాశాలను పొందనుంది.

కోర్సు అమలు ఇలా..

వాస్తవానికి బీఎఫ్ఎస్ఐ కోర్సు చదవడానికి రూ.లక్షల్లో ఖర్చు వెచ్చించాల్సి ఉంటుంది. స్కిల్ యూనివర్సిటీలో భాగంగా యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం రెగ్యులర్ కోర్సుతో పాటు అదనంగా ఈ కోర్సును ప్రవేశపెట్టింది. బీఎఫ్ఎస్ఐ అనే సంస్థ ద్వారా కోర్సుకు సంబంధించిన పాఠ్యాంశాన్ని రూపొందించారు. డిగ్రీ మూడు సంవత్సరాల్లో బీఎఫ్ఎస్ఐ కోర్సును అభ్యసిస్తారు. ప్రతి సెమిస్టర్‌లో రెగ్యులర్ సబ్జెక్టులతో పాటు బీఎఫ్ఎస్ఐకు సంబంధించిన సబ్జెక్ట్ ఉంటుంది. కాలేజీ నుంచి 500 మంది విద్యార్థులను ఈ కోర్సుకు ఎంపిక చేస్తారు. దీనికి సంబంధించిన బోధన బీఎఫ్ఎస్ఐ సంస్థ ఆన్‌లైన్ ద్వారా చేస్తుంది. పరీక్షల నిర్వహణ, మూల్యాంకణం అంతా బీఎఫ్ఎస్ఐ సంస్థనే చూస్తుంది. అందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. డిగ్రీ పూర్తి చేసిన వెంటనే బీఎఫ్ఎస్ఐ పూర్తి చేసిన విద్యార్థికి కంపెనీ ఉద్యోగ అవకాశం కల్పిస్తుంది.

ఉద్యోగ అవకాశాలు ఉంటాయి



యువతకు ఉద్యోగ అవకాశాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి బీఎఫ్ఎస్ఐ కోర్సును ప్రవేశపెట్టింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్జీ కళాశాలలో ఈ కోర్సు అందుబాటులో ఉంటుంది. ప్రైవేట్ సంస్థ అయిన బీఎఫ్ఎస్ఐ కోర్సుకు సంబంధించిన పాఠ్య ప్రణాళికను రూపొందించింది. అందుకు అనుగుణంగా కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు బోధన అందించి, పరీక్షలు నిర్వహించిన అనంతరం మూల్యాంకనం చేస్తుంది. కోర్సును పూర్తి చేసిన వారికి సంస్థ ద్వారా వెంటనే ఉద్యోగ అవకాశం లభిస్తుంది.
- డాక్టర్ సముద్రాల ఉపేందర్, ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్

మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి : హైదరాబాద్ జంటనగరాలకు నీటిని సరఫరా చేసే కీలక విభాగమైన పుట్టంగండి సిస్టర్న్ కట్ట మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఎన్సీ నాగేంద్రరావు ఏఎమ్మార్పీ అధికారులను ఆదేశించారు. ఆదివారం పుట్టంగండి సిస్టర్న్ కట్ట పేరాపెట్ వాల్ 100 మీటర్ల మేర దెబ్బతిని కూలిపోవడంతో దాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఆయన కట్ట మరమ్మతులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కట్ట దెబ్బతిన్న ప్రాంతాన్ని గుర్తించి వెంటనే గ్యాబిన్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఏఎమ్మార్పీ నల్లగొండ సీఈ అజయ్‌కుమార్, ఈఈ సత్యనారాయణ, డీఈ నాగయ్య, ఏఈ శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.



పుట్టంగండి సిస్టర్న్ కట్టను పరిశీలిస్తున్న ఈఎన్సీ

తెలంగాణ ఉద్యమ సంస్థ.. టీఎల్‌ఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

రామగిరి (నల్లగొండ) : తెలంగాణ ఉద్యమ సంస్థ.. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం (టీఎల్‌ఎఫ్) అని ఆ ఫోరం చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి అన్నారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ లెక్చరర్స్ భవన్‌లో 'మిషన్ ఎడ్యుకేషన్ తెలంగాణ' అనే అంశంపై ఆదివారం జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే లక్ష్యంతో టీఎల్‌ఎఫ్ పని చేస్తుందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉన్నారని, ఈ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థకు మేలు జరుగుతుందని భావిస్తున్నామని తెలిపారు. విద్యా విధానంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సదస్సులు నిర్వహించి విద్యావేత్తల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నామని తెలిపారు. అనంతరం తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి చుక్క సైదులును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం చైర్మన్ ఎంవీ.గోనారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామకృష్ణయ్య, ప్రొఫెసర్ కె.అంజిరెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, కె.కృష్ణయ్య, టి.శివరాంరెడ్డి, బి.వేణు, జి.గోపీనాథ్, లావుడియా నాగేశ్వర్, సీహెచ్.శివప్రసాద్, పి.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సిహెచ్.శ్యాంసుందర్, ఎస్.రజని, గెస్ట్ ఫ్యాకల్టీ జిల్లా అధ్యక్షుడు పెరిక మధు తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగుల హక్కుల సాధనకు ఉద్యమిస్తాం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

నల్లగొండ : ఉద్యోగుల హక్కుల సాధనకు ఉద్యమిస్తామని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు అంశాలపై కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అధికారుల సస్పెన్షన్ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా అగ్గిరాజుకుందన్నారు. కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల తీరుపై ముఖ్యమంత్రి, సీఎస్‌లకు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాం, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆర్.శ్రీనివాసమూర్తి, సీనియర్ నాయకులు మోహన్‌రావు, రాష్ట్ర నాయకులు గోపి, ఏడుదొడ్ల వెంకటరాంరెడ్డి, టీఎన్‌జీఓ జిలా కార్యదర్శి శేఖర్ రెడ్డి, మినిస్టీరియల్ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొప్పు రాంబాబు, ఎన్నికల అధికారులు జి.వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బాలరాజురెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా అమరేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా చరితారెడ్డి, ఇస్మాయిల్, వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శిగా పర్వేజ్, మహిళా కార్యదర్శిగా కనకదుర్గ, కోశాధికారిగా సందీప్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మహ్మద్ అలీ, పబ్లిసిటీ సెక్రటరీగా అనీఫ్, ఆఫీస్ సెక్రటరీగా జాకిర్ అలీ, కల్చరల్ సెక్రటరీగా ఖాసిం, గేమ్స్ సెక్రటరీగా రాజారాం, కార్యవర్గ సభ్యులుగా శివకుమార్, రవీందర్, ప్రసాద్, శ్రవణ్‌కుమార్ ఎన్నికయ్యారు.

సూపర్ సేవలు

పేదల ఆరోగ్యానికి భరోసానిస్తున్న ఎయిమ్స్



ఎయిమ్స్‌లో నూతనంగా నిర్మితమవుతున్న భవనాలు

- విస్తరిస్తున్న అత్యాధునిక వైద్యసేవలు
- నానాటికీ పెరుగుతున్న ఓపీ
- డిసెంబర్ లోపు అందుబాటులోకి 700 పడకలు

బీబీనగర్ : ఉమ్మడి నల్లగొండతో పాటు ఉమ్మడి వరంగల్, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర జిల్లాల ప్రజలు సూపర్ స్పెషాలటీ వైద్యంకోసం ఎక్కడికో వెళ్లాల్సిన బాధలు తప్పుతున్నాయి. బీబీనగర్ ఎయిమ్స్‌లో ఇప్పటికే ఆధునిక వైద్యసేవలు అందుతుండగా మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు మమ్మరంగా కొనసాగుతున్నాయి. 700 పడకల సామర్థ్యంతో రూ.1,365 కోట్ల అంచనా వ్యయంతో భవనాలను నిర్మిస్తున్నారు. వీటిని ఈ ఏడాది డిసెంబర్‌లోగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు చెబుతున్నారు.



అత్యాధునిక వైద్య పరికరాలతో ఏర్పాటు చేసిన చిన్నారుల విభాగం

కొనసాగుతున్న 33 విభాగాల వైద్యసేవలు

ప్రస్తుతం ఎయిమ్స్‌లో 33 విభాగాలకు చెందిన వైద్యసేవలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఆయా విభాగాలకు సంబంధించి 12వేలకు పైగా శస్త్ర చికిత్సలు నిర్వహించారు.43,500కు పైగా ఇతర సేవలను దాదాపు లక్ష మంది వినియోగించుకున్నారు.

10 రూపాయలకే..

ఎయిమ్స్‌లోని డాక్టర్‌ను సంప్రదించడం కోసం నామమాత్రపు ఫీజు 10 రుపాయలు తీసుకుంటున్నారు. దీంతో ఇప్పటి వరకు నాలుగు లక్షలకు పైగా ఓపీ సేవలు పొందారు. రోజూ 2వేలకు పైగా ఓపీ నమోదవుతోంది. ఓపీతో పాటు జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, అప్తామలజీ న్యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, రేడియాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, ప్రసూతి సేవలు, పిడియాట్రిస్టు తదితర సేవలతో పాటు ఎమర్జెనీ సేవలు అందుతున్నాయి.

24 రకాల భవనాల నిర్మాణాలు

ఆధునిక వైద్యసేవలను మరింత విస్తరించేందుకు మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎయిమ్స్‌లో నూతనంగా 24రకాల భవనాలను నిర్మిస్తున్నారు. అమృత నివాస్ నూతన వైదాస్పత్రి, అకడమిక్ బ్లాక్, విద్యార్థుల వసతి గృహాలు, వైద్యుల క్వాటర్స్ తదితర వాటిని 19, 23, 15, 20 అంతస్తులతో కూడిన భవనాలు నిర్మిస్తున్నారు. 2024 లోపే భవనాలను పూర్తి చేసి అవసరమైన పోస్టులను భర్తీ చేసి 750 పడకల ఆస్పత్రిగా ఎయిమ్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ఎయిమ్స్ అందుబాటులోకి వస్తే పేదలకు ఇది వరంగా మారనుందని చెపుకోవచ్చు.

డిసెంబర్‌లోపు పూర్తి చేస్తాం



ఎయిమ్స్ ఆస్పత్రి భవన నిర్మాణాలను 2024 డిసెంబర్ లోపు పూర్తిచేసి ప్రజలకు అన్ని రకాలతో కూడిన మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా 24 రకాల భవనాలు నిర్మిస్తున్నాం. వీటి పనులు తుది దశకు చేరాయి. ఇవి అందుబాటులోకి వస్తే అత్యాధునిక వైద్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.
- వికాస్ భాటియా, ఎయిమ్స్ డైరెక్టర్

వైద్యం బాగుంది



కొంతకాలంగా జర్వం, కాళ్ల నొప్పులు రావడంతో బీబీనగర్ ఎయిమ్స్‌కు వచ్చాను.వైద్యం బాగుంది.డాక్టర్లు కూడా పేషెంట్లతో మంచిగ మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్నారు. మిగతా ఆస్పత్రులతో పోలిస్తే వైద్య సేవలు మంచిగ అనిపించాయి. కాకపోతే ఓపీ విభాగం వద్ద చాలా సమయం తీసుకుంటుంది. రిజిస్ట్రేషన్ కోసం అదనంగా కౌంటర్లను పెంచాలి.
- కృష్ణవేణి చౌటుప్పల్



ఎయిమ్స్‌లో ఓపీ విభాగంలో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బారులుదీరిన రోగులు

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నార్కట్‌పల్లి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం తొండల్‌వాయి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండల్‌వాయి గ్రామానికి చెందిన బొడిగె వెంకన్న కుమారుడు సాయిచరణ్(16) నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేని సాయిచరణ్ గత నాలుగు రోజుల నుంచి ఇంటి నుంచే కాలేజీకి వెళ్లి వస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చే సాయికుమారుడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి చూడగా అప్పటికే అతడు మృతిచెందాడు. సాయిచరణ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

మద్యానికి బానిసై..

దేవరకొండ: మద్యానికి బానిసైన వ్యక్తి మనస్తాపంతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దేవరకొండ పట్టణంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ కోటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణానికి చెందిన కంచర్ల తిరుపతయ్య(47) స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. తిరుపతయ్య పట్టణంలోని పలు టిఫిన్ సెంటర్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన తిరుపతయ్య ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై శనివారం రాత్రి దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి తల్లి లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

వేములపల్లి (మాడ్గులపల్లి): పొలం వద్ద కరెంట్ వైరును సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కడం గ్రామానికి చెందిన లొడంగి గోవింద్(45) వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం తన కొడుకు నరేష్‌తో కలిసి పొలానికి వెళ్లాడు. స్టార్టర్‌కు కరెంట్ సప్లయ్ అయ్యే వైర్ తెగిపోవడంతో గోవింద్ దాన్ని కటింగ్ ప్లేయర్‌తో సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. కొడుకు వెంటనే తల్లి నాగలక్ష్మికి సమాచారం అందించగా.. ఆమెతో పాటు గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని గోవింద్‌ను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్. కృష్ణయ్య తెలిపారు.

గ్రామాల్లో దసరా స్కీంల జోరు

- రూ.200 కొట్టు.. మేకను పట్టు అంటూ ఆఫర్లు
- మాంసం, మద్యం స్కీంలపై పోలీసుల ఆరా



పెర్కకొండారంలో స్కీంకు సంబంధించిన ఫ్లెక్సీ



తుడిమిడి గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

శాలిగౌరారం: దసరా పండుగ సమీపిస్తున్న తరుణంలో నల్లగొండ జిల్లాలోని పలు గ్రామాల్లో మద్యం, మాంసం స్కీంల జోరు నడుస్తోంది. ఇటీవల చిట్యాల మండలం వెలిమినేడులో, మర్రిగూడ మండలం లెంకలపల్లిలో ఇటువంటి స్కీంలు వెలుగులోకి రాగా.. శాలిగౌరారం మండలం పెర్కకొండారం, తుడిమిడి గ్రామాల్లో దసరా బంపర్ ఆఫర్ పేరుతో కొంతమంది యువకులు మద్యం, మాంసంతో కూడిన సరికొత్త స్కీంలను ప్రారంభించారు. పెర్కకొండారం గ్రామంలో 'రూ.200 కొట్టు.. మేకను పట్టు' అంటూ వాట్సాప్‌లో ప్రచారానికి తెరలేపారు. రూ.200 కూపన్ కొనుగోలు చేస్తే కూపన్‌లను డ్రా పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు ప్రచార చిత్రంలో పొందుపరిచారు. ప్రథమ బహుమతిగా 12 కిలోల మేకపోతు, ద్వితీయ బహుమతిగా రెండు మద్యం ఫుల్‌బాటిళ్లు(ఆంటిక్విటీ), తృతీయ బహుమతిగా 12 బీర్లు(కింగ్‌ఫిషర్), నాల్గవ బహుమతిగా రెండు నాటుకోడి పుంజులు, ఐదో బహుమతిగా ఒక మద్యం ఫుల్‌బాటిల్(బ్లెండర్స్ ప్రైడ్) ఇవ్వనున్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా తుడిమిడి గ్రామంలో 'రూ.101 కొట్టు.. మద్యం పట్టు' పేరుతో స్కీం నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రథమ బహుమతిగా ఒక మద్యం ఫుల్‌బాటిల్(రెడ్‌లేబుల్), ద్వితీయ బహుమతిగా ఒక మద్యం ఫుల్‌బాటిల్(బ్లాక్‌డాగ్), తృతీయ బహుమతి ఒక నాటుకోటి పుంజు, నాల్గవ బహుమతిగా 12 బీర్లు(బడ్వైజర్), ఐదో బహుమతిగా 9 కూల్‌డ్రింక్ బాటిళ్లు(2 లీటర్ల థమ్సప్) ఇచ్చేటట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఈ స్కీంల ప్రచారంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై ఎస్ఐ సైదులు ఆదివారం ‘సాక్షి’తో మాట్లాడుతూ.. మద్యం, మాంసం స్కీంల నిర్వహణపై సమాచారం సేకరించామని, సంబంధిత స్కీంల నిర్వాహకులకు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. స్కీంలను నిలిపివేయకపోతే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



శ్రీను (ఫైల్)

మద్దిరాల(తుంగతుర్తి): భూతగాదాల కారణంగా పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మద్దిరాల మండలం కుక్కడం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజాగాని తండాలో ఆదివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాగానితండాకు చెందిన లాకవత్ శ్రీను(26)కు అదే తండాకు చెందిన లాకవత్ రెడ్యా, లాకవత్ రవీందర్, లాకవత్ సురేష్ మధ్య కొన్నేళ్లుగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పంచాయతీ తీర్మాణం చేసినా భూ వివాదం అలానే ఉండిపోయింది. శనివారం లాకవత్ శ్రీను తన చేనులో కూలీలతో పత్తి తీయడానికి యత్నించగా రెడ్యా అడ్డుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన లాకవత్ శ్రీను అక్కడే గడ్డిమందు తాగి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే శ్రీనును సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, లాకవత్ రెడ్యా, రవీందర్, సురేష్‌ను అదుపులోకి తీసుకోని విచారిస్తున్నట్లు సీఐ శ్రీనునాయక్ తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మద్దిరాల ఎస్ఐ వీరన్న, నూతనకల్లు ఎస్ఐ అమర్‌నాథ్, తుంగతుర్తి ఎస్ఐ ఏడుకొండలు, నాగారం ఎస్ఐ అవిలయ్యతో పాటు స్పెషల్ ఫోర్స్, కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



భీముడు (ఫైల్)



వెంకటేష్ (ఫైల్)

కొండమల్లేపల్లి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన ఆదివారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చెన్నారం గేటు సమీపంలో జరిగింది. ఎస్ఐ రామ్మూర్తి, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుగొమ్ము మండలం బుగ్గతండాకు చెందిన లోటావత్ భీముడు(23), అతడి అన్న కుమారుడు వెంకటేష్(8)తో కలిసి ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై నాంపల్లి మండలం రేక్యతండాలో గల తమ బంధువుల ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండల పరిధిలోని హైదరాబాద్–నాగ్జానసాగర్ ప్రధాన రహదారిపై చెన్నారం గేటు మూలమలుపు వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందగా.. భీముడిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారులో ఐదుగురు యువకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చీరాలకు వెళ్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోదాడరూరల్: కోదాడ మండలం బీక్యాతండా శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీక్యాతండాకు చెందిన బాణోతు లాలు, పంతులునాయక్ తండాకు చెందిన భూక్యా నాగేశ్వరరావు రేషన్ లబ్దిదారుల నుంచి తక్కువ ధరకు క్వింటాల్ రేషన్ బియ్యం కొనుగోలు చేసి తండా శివారులో డంప్ చేసేందుకు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. టీవీఎస్ ఎక్సెల్‌ను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వర్ణగిరిలో సంగీత, నృత్య కళా ప్రదర్శన



ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులు

భువనగిరి: పట్టణంలోని స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పతంజలి సంస్థ నిర్వహకురాలు రమ్య ఆధ్వర్యంలో సంగీత, నృత్య కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రమ్యతో పాటు చిన్నారుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ జర్నలిస్టు శంకర్‌నారాయణ హాజరయ్యారు. దేవాలయంలో సంగీత నృత్య ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళా గురువులు కృష్ణ, ప్రియ కళ్యాణి, లలితారవీంద్ర, ప్రశాంతి, జయలక్ష్మి, అనురాధ, ప్రమోద్‌కుమార్, దుర్గ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి పైకప్పు



ధ్వంసమైన గృహోపకరణాలు

హుజూర్‌నగర్: పట్టణంలోని 15వ వార్డులో పొనుగుపాటి వెంకటేశ్వర్లుకు చెందిన ఇంటి పైకప్పు ఆదివారం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ ఇంట్లో కిరాయికి ఉంటున్న పిల్లుట్ల నరేష్, అతడి భార్య లక్ష్మి, కుమార్తె నవ్యలు భోజనం చేసి ఇంటి బయటకు వెళ్లిన కొన్ని క్షణాలకే హాల్ పైకప్పు కూలిపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇంట్లోని గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. సుమారు రూ.1.70లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. కుప్పకూలిన ఇంటిని కౌన్సిలర్ కోట నరసింహారావు, కారెంగుల వెంకటేశ్వర్లు తదితరులు పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటి పైకప్పు నాని కూలిపోయినట్లు భావిస్తున్నారు.

గొప్ప విద్యాదాత సత్తార్ సార్

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: ఎంతోమంది విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పి ఉన్నతంగా తీర్చిదిద్దిన సత్తార్ సార్ గొప్ప విద్యాదాత అని మాజీ మంత్రి, సర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో నిర్వహించిన సత్తార్ సార్ సంతాప సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సత్తార్ సార్ దగ్గర తాను చదువుకున్నది కొంతకాలమే అయినప్పటికీ ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. ఆయన దగ్గర విద్యనభ్యసించిన వారు వివిధ రంగాల్లో ఎంతో ఉన్నత స్థితిలో ఉన్నారన్నారు. సత్తార్ సార్‌కు లెక్కలు చెప్పడం తప్ప తన జీవితంలో ఏనాడూ లెక్కలేసుకోలేదన్నారు. అందుకే ఆయన చివరి శ్వాస వరకు సాధారణ జీవితమే గడిపారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, గోపగాని వెంకటనారాయణగౌడ్, దేగల జనార్దన్, జుట్టుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముస్లింలు రాజకీయంగా వెనుకబడ్డారు

- యునైటెడ్ ముస్లిం మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సయ్యద్ తాజుద్దీన్



అభివాదం చేస్తున్న ముస్లిం నాయకులు

రామగిరి (నల్లగొండ): ముస్లింలు రాజకీయ, ఆర్థిక, విద్య రంగాల్లో వెనుకబడి ఉన్నారని యునైటెడ్ ముస్లిం మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సయ్యద్ తాజుద్దీన్ అన్నారు. నల్లగొండలోని ఇదారే ఇకమత్ ఖానా బహదూర్ ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం యునైటెడ్ ముస్లిం మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మైనార్టీలపై ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ముస్లింలు అనేక రంగాల్లో వెనక్కు నెట్టివేయబడుతున్నారని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలు ఏకతాటిపై ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. యునైటెడ్ ముస్లిం మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ అనేది రాజకీయ స్వచ్ఛంద సంస్థ అని, ఆ సంస్థ నల్లగొండ పట్టణంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. మైనార్టీలపై జరుగుతున్న అన్యాయాలను ఎలుగెత్తి చూపటానికి బహుజన వర్గాలు సైతం సహకరించాలని కోరారు. ముస్లిం మైనార్టీలకు రాజ్యాంగ ఫలాలు అందకుండా చేస్తున్నారని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజియుద్దీన్, న్యాయవాది మసియుద్దీన్, షఫీ నవాజ్‌ఖాన్, జాఫర్, అఫ్జలుద్దీన్, సద్దాం హుస్సేన్, జావీద్, చాంద్ పాషా, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గోరెంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1991-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

మద్దిరాల: మండల పరిధిలోని గోరెంట్ల గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం 1991–96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 28 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. ఈ సదర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు..?

డిండి: మండల పరిధిలోని చెర్కుపల్లి గ్రామ స్టేజీ సమీపంలో శనివారం దారుణ హత్యకు గురైన శ్రీపతి జగదీష్ మృతదేహాన్ని ఆదివారం దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన రమాదేవికి కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్(34)తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. జగదీష్ హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు కారణంగా గత రెండున్నరేళ్ల నుంచి రమాదేవి పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోనే తన తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. అయితే కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామంలో ఆదివారం జగదీష్ అంత్యక్రియలకు అతడి భార్య రాలేదని, మృతుడి కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఇద్దరు కుమారులను పోలీసులు హైదరాబాద్ నుంచి తీసుకొచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కామేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. తమ కుమారుడిని కిడ్నాప్ చేసి హత్య చేశారని మృతుడి తల్లిదండ్రులు శ్రీపతి వెంకన్న, ఎల్లమ్మ ఆరోపిస్తున్నారు.

ఆర్టీఓ సిబ్బంది పేరిట డబ్బులు వసూలు

త్రిపురారం : ఆర్టీఓ సిబ్బంది అని చెప్పి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను ఆపి డబ్బులు వసూలు చేసిన ఘటన నిడమనూరు మండల పరిధిలో జరిగింది. ఆదివారం నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండల కేంద్రానికి చెందిన పడిశల శివకు చెందిన ట్రాక్టర్‌లో డ్రైవర్ పడిశల సైదులు పశువుల పెంటను తీసుకెళ్లి నిడమనూరు మండలం గుంటిపల్లి గ్రామంలోని ఓ తోటలో అన్‌లోడ్ చేసి తిరిగి త్రిపురారం వైపు వస్తున్నాడు. నిడమనూరు మండలం బొక్కమంతలపాడు పరిధిలోని ఆముదాల మిల్లు వద్దకు రాగానే ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి ట్రాక్టర్‌ను ఆపి ఆర్టీఓ సిబ్బంది అని చెప్పి ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ పేపర్లు చూపించమని డ్రైవర్ సైదులును అడిగారు. ట్రాక్టర్ పత్రాలు ఇంటి వద్ద ఉన్నాయని చెప్పడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించాలని కొద్దిదూరం తీసుకొచ్చారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్తే కేసు అవుతుందని, ఫైన్ కడితే ఇంటికి పంపిస్తామని నమ్మించారు. దీంతో ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ ఫోన్‌పే ద్వారా రూ.4350 వారికి ట్రాన్స్‌ఫర్ చేశారు. వారు ఎలాంటి రిసిప్ట్ ఇవ్వకపోగా.. ఎస్ఎంఎస్ కూడా రాలేదు. వారికి ఫోన్‌పే చేసిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని రావడంతో మోసపోయామని గ్రహించి నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సైకిల్‌ను ఢీకొన్న కారు.. ఒకరు మృతి

నార్కట్‌పల్లి: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్మాని గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో సైకిల్‌పై సమోసాలు విక్రయిస్తున్న రామన్నపేట మండలం జనంపల్లి గ్రామానికి చెందిన చొప్పరి వెంకయ్య(55)ను నార్కట్‌పల్లి నుంచి అమ్మనబోలు వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన వెంకయ్యను 108 వాహనంలో కామినేని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కారు, ఆటో ఢీ.. మహిళకు గాయాలు

త్రిపురారం: కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నిడమనూరు మండలం తుమ్మడం గ్రామ పంచాయతీ పరిధిలోని కోటమైసమ్మ గుడి సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముకుందాపురం నుంచి కోటమైసమ్మ గుడి వైపు వెళ్తున్న కారు, కోటమైసమ్మ గుడి నుంచి ముకుందాపురం వైపు వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నారమ్మగూడెం గ్రామానికి చెందిన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను 108 వాహనంలో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని తిమ్మాపురం ఎక్స్‌రోడ్డు వద్ద ఎలగందుల మల్లయ్యకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీని శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మల్లయ్య తన ట్రాక్టర్‌ను రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. ఆదివారం ఉదయం ట్రాక్టర్‌ను తీసేందుకు ప్రయత్నించగా స్టార్ట్ కాకపోవడంతో బ్యాటరీ బాక్స్ తెరిచి చూడగా.. అందులో బ్యాటరీ కనిపించలేదు. చోరీకి గురైన బ్యాటరీ విలువ రూ.18వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆతర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు వికాస్‌పాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే, భక్తులు పాల్గొన్నారు.

పత్తిలో సూక్ష్మలోపాలు – నివారణ చర్యలు

- సరైన చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు
- నడిగూడెం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దేవ ప్రసాద్



నడిగూడెం మండలం నారాయణపురంలో పత్తి చేను

పాడిపంట

నడిగూడెం: ప్రస్తుతం కొన్నిచోట్ల పత్తి పంట పూత, పిందె, కాయలు ఏర్పడడం, మరికొన్ని చోట్ల కాయ పగిలి దూది ఏర్పడుతున్న దశలో ఉంది. రైతులు ఒకే నేలలో పంట మార్పిడి చేయకుండా పత్తినే సాగు చేస్తుంటారు. ఇలాంటి సమయంలో సూక్ష్మపోషకాల లోపాలు కన్పిస్తున్నాయని, రైతులు ఎప్పటికప్పుడు సరైన చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని నడిగూడెం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దేవ ప్రసాద్ చెబుతున్నారు.

జింకు లోపం: ఆకుల ఈనెలు ఆకుపచ్చగా ఉండి ఈనెల మధ్యభాగం పసుపుపచ్చగా మారుతుంది. ఆకులు చిన్నవిగా ముడుతలు పడి ఉండి కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. మొక్క గిడసబారుతుంది. ఒకే పంట సాగు చేయడంతో పాటు భాస్వరం ఎరువులు అధికంగా వాడటం, చౌడు భూములు కావడం, సహజ సిద్ధంగా లోపం కలిగిన నేలలు కారణం. 2 గ్రాముల జింకు సల్ఫేట్ లీటరు నీటికి కలిపి రెండు లేదా మూడుసార్లు ప్రతి ఐదురోజులకు ఒకసారి పిచికారీ చేయాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్‌ను భూమిలో వేయాలి.

మెగ్నీషియం లోపం: ముదురు ఆకుల అంచులు పసుపు రంగుకు మారుతాయి. తర్వాత ఆకులు ఎర్రబడి ఎండి రాలిపోతాయి. ఆకుల ఈనెలు మాత్రం రంగు మారక ఆకుపచ్చగా ఉంటాయి. పొటాషియం ఎక్కువగా ఉన్న నేలల్లో ఈ లోపం కన్పిస్తుంది. లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున మెగ్నీషియం సల్ఫేట్‌ను కలిపి పైరుపై వారం నుంచి పది రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

పూత, పిందె రాలడం

ప్రతికూల పరిస్థితులలో (అధిక తేమ లేదా బెట్ట) మొక్కల జీవన ప్రక్రియలో వచ్చే మార్పుల వలన పత్తిలో గూడ, పూత, పిందె రాలడం జరుగుతుంది. దీని నివారణకు ప్లానోఫిక్స్ (యన్.ఎ.ఎ.10 పి.పి.యం) ద్రావణాన్ని 5 లీటర్ల నీటిలో 1 మి.లీ. చొప్పున కలిపి 10–15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. ప్లానోఫిక్స్‌ను విడిగా కానీ లేదా లీటరు నీటి కి 20 గ్రాముల డిఎపి లేదా యూరియా ద్రావణంతో కలిపి గానీ పిచికారీ చేస్తే ఫలితం బాగుంటుంది.

బోరాన్ లోపం: పూలు చిన్నవిగా మారడం, పూలు, కాయ, పిందె రాలడం, మొక్కలు గిడసబారి కాండం పై పగుళ్లు ఏర్పడడం జరుగుతుంది. ఈ లోపం సున్నం పాలు ఎక్కువగా ఉన్న నేలల్లో వర్షాభావ పరిస్థితులలో మరియు అధిక వర్షపాతం ఉన్నప్పుడు కనిపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 1.5 గ్రాముల బోరాక్స్ కలిపి 1 లేదా 2 సార్లు 7–10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.